# ఉగాది ఉపదేశం

శ్రీమతి వడ్డి కృష్ణవేణి

అప్పుడే ఆఫీసునుంచి వచ్చి శ్రీమతి ఇచ్చిన కాఫీసేవించి ఈ జీచైరులో కూర్చున్నాడు ప్రకాశం. ప్రకాశం వింత మనోప్రవృత్తికలవాడు. ఎప్పుడూ ఎవరినో ఒకరిని ఏడిపించటం అతనికి సరదా. కుర్చీలో కూర్చున్నాడన్నమాటేగాని అతనికి తోచటంలేదు. కారణం ఏడిపించటానికి ఎవరు లేకపోవటమేనని పాఠకులు గుర్తించాలి. వెంటనే శ్రీమతి స్మృతి పథంలోకి వచ్చింది. శారద కాస్త మాటంటే చాలు ఏడుస్తూకూర్చుంటుంది. ప్రకాశం వెంటనే సీరియసుగా భార్యను పిల్చాడు. ఆమె ఏదో పనిమీదవుండి పలకలేదు.

"ఏమేవ్! ఇల్లారా" అంటూ గావుకేక పెట్టాడు.

"ఎందుకండీ అంతలో కేకలు? ఏం పనొచ్చిందిప్పుడు?"

"ఏం పనా! వల్లకాటిపని- తెల్సిందా?"

"బాగుంది మీవరస - మీతో ఏది మాట్లాడినా తప్పే."

"నాతో ఏది మాట్లాడినా తప్పయితే మాట్లాడం మానేసెయ్యి,"

"పోనీగానిండీ! మీరు పిలిచినపనేదో చెప్పండి."

"ఎల్లుండి పండగకదూ?"

"యేం పండగా! ఉగాది పండగకదూ!"

"పండగ యెల్లుండయితే నన్నేం చెయ్యమన్నారు?"

"నిన్నేంచెయ్యమనటంలేదు-మీ వాళ్లు పిలవలేదేమని అడుగుతున్నా?"

"మొన్ననేగా సంక్రాంతికి పిల్చారు. వాళ్ళను ముప్పతిప్పలుపెట్టి వచ్చారు చాలదూ!"

"నేను వాళ్లని తిప్పలు పెట్టానని అన్నావుగాని మరి మీవాళ్లుచేసిన పని బాగుందా!"

"మా వాళ్లేంచేశారు?"

"ఏం చెయ్యాలి! నాకునచ్చని సిల్కు పంచెలెందుకు పెట్టాలి?"

"అయ్యో! ఇదేం చిత్రమండీ! దసరాకు నూలుబట్టలు పెడితే ఇవేం బట్టలు అల్లుడికి సిల్కు బట్టలు పెట్టాలిగాని అన్నారాయెను. ఇప్పుడవి పెడితే అవిగాదంటె ఇంక మీకు పెట్టేదెలాగు!"

"పెట్టేవేమిటో అల్లుళ్లనడిగి పెడతారా? మామగార్లు అల్లుళ్ల ముఖ వైఖరిని

బట్టి ఆయాసందర్భానుసారముగ నడుచుకోవాలి గాని ఏమి తెలియని నంగనాచుల్లాగ వుండటం బాగులేదు, ''

''అల్లుళ్లని అందర్నీ కలపకండి. మీ వంటి వింత మనోప్రవృత్తులు గల అల్లుళ్లుండటంచాల అరుదు. మానాన్న గారికి ఎన్ని జన్మాలసుకృతంవల్లనో మీరు దొరికారు. ఒక్క-గానొక్క కూతురునైనందుకు వారిమనసుకు సంతోషంలేకుండా పోయింది. ప్రతిపండగకు ఏదో ఒక పేచీలతో సరిపోతున్నది.''

''ఏమిటి నీవాగుడు ? మీ వాళ్లకు సంతోషంలేదని విచారిస్తున్నావుగాని నాకు మాత్రం సంతోషంవుందా ! మీ వాళ్ల చేతలకు నేను విచారిస్తున్నాను.''

''అందుకనే ఈ పండుగకు మన ఇంట్లో మనము, వారి ఇంట్లోవారు వుంటె అందరి మనసులు ఆనందంగా వుంటాయి. వారు పిలవలేదని అడగటమెందుకు? యిప్పుడు ఈ వాదోప వాదాలెందుకు ?''

''ఎందుకేమిటి ? అదొకసరదా, మామగార్లు అల్లుళ్ళని పిలవడం, వారు వెళ్ళటం మొదలయినవన్నీ లాంఛనప్రాయాలు. అయినా ఈపాటికి మీ నాన్న వస్తూనే వుంటాడు.''

''ఈసారి ఖండితంగా నేను రానని చెప్తాను.''

''అబ్బో ! ఈ మాటలకేంలే నాన్నే వచ్చి పిలుస్తుంటే వెళ్లకుండావుంటావా! అయినా చూస్తాగా ఎల్లా వెళ్లవో ?''

''వెళ్లకుండా వుంటావా అంటున్నారు, మీరురారా ?''

''నేనెందుకు ? నేవస్తే మీవారి మనసులకు సంతోషంవుండదు. ఒక్క-గానొక్క కూతురివైనందుకు నీవే వెళ్లు వారికి సంతోషంగావుంటుంది'' అంటూ ఒక గంటసేపు భార్యను ఏడిపించి బజారుకు వెళ్లాడు. శారద ఇంటిపనుల్లో నిమగ్నురాలయిందన్నమాటేగాని మనసులో చాల బాధపడుతున్నది.

మర్నాడు ఉదయాన్నే గోపాలంగారు కూతుర్ని అల్లుణ్ణితీసుకువెళ్లటానికి వచ్చారు. 'శారదా! అదుగో మీ నాన్నగారు వచ్చారు. కాళ్లు కడుక్కోటానికి నీళ్లుతెచ్చి ఇయ్యి' అని పిల్చాడు. కాని భర్తమాటలను నమ్మలేదు శారద. ''ఏమండీ! అంతాకులాసాయేనా ? మీమాటే అనుకుంటున్నాము.'' అని మామగార్ని పలుకరించాడు.

''కులాసాగానే వున్నాము నాయనా. అమ్మాయి ఏది ?''

''మీ అమ్మాయి నామాటనమ్మటం లేదు. మీరే పిలువండి''

"శారదా! ఏంచేస్తున్నావమ్మా?"

"ఆ! ఎంతసేపయింది నాన్నా! వచ్చి. వారంటుంటే వేళాకోళమనుకున్నా అమ్మ కులాసాగావుందా? ఏదో పనిమీద వచ్చినట్టున్నావు?"

"పనేముందమ్మా, రేపు ఉగాదిపండుగ కదూ. మిమ్మల్ని తీసుకు వెడ్దామని వచ్చాను. త్వరగా ప్రయాణమవండి."

"ఈసారి ఆయనరారట. నన్నే వెళ్లమన్నారు."

"అదేమిటి ప్రకాశం! మా అమ్మాయి కంటెనీ వేముఖ్యమైనవాడివి. నీవులేని పండగేమిటి?"

"నేవస్తే మీకుసంతోషం వుండదని మీ అమ్మాయి విచారిస్తున్నది. అందుకని రానన్నాను."

"అదేమిటి శారదా! తప్పుగాదూ! అతనివల్ల మాకెప్పుడు విచారంలేదు."

"అదికాదునాన్న! నిన్నటినుంచి "నువ్వు పండుగకు పిలువలేదని అల్లుడిమనోభావాలు గ్రహించిబట్టలు పెట్టాలని అంటున్నారు. అందుకని ఏ బట్టలుపెట్టినా నచ్చవుకదా అల్లాంటప్పుడు అక్కడికెందుకు! మన ఇంట్లోనేవుంటే వారికి, మనకు సంతోషంగ వుంటుందని అన్నాను."

"తప్పమ్మా! అల్లాఅనకూడదు. అతనల్లా అనడంకూడా ఒక విధమయిన ఆనందమే. ప్రపంచధర్మం అంతే. మామగార్లు మీద అల్లుళ్లు అలగటం, ఎంతపెట్టినా అల్లుళ్లకు తృప్తిలేదని మామగార్లు మానమవలంభించటం అనాదినుంచి ఆచారమైపోయింది. అంతేగాని మరేంలేదు. ప్రకాశం త్వరగా ప్రయాణమవండి. సాయంత్రానికి ఇల్లు చేరకపోతే మీ అత్తగారు కంగారు పడుతుంది."

"అల్లాగేలెండి. శారదా! త్వరగా భోజనాలు పూర్తిచేసి ఇల్లు సర్దుకో-రైలు టయమవుతున్న"దని భార్యకుచెప్పి మామ అల్లుడు మాట్లాడుకుంటూ కూర్చున్నారు. శారద త్వరగా పనులన్ని చేసుకొని ప్రయాణమయింది. ముగ్గురుకలసి స్టేషనుకు చేరారు.

సాయంత్రమయిది గంటలకల్లా గోపాలంగారు కూతురు అల్లుడితో సహా స్వగ్రామం చేరుకున్నారు. శాంతమ్మగారి ఆనందానికి అవధిలేకుండావుంది. "ఇదుగో నీకూతురు అల్లుడు నీకప్పచెపుతున్నా"నని గోపాలంగారనగానే "నాకేగాని మీకు మాత్రంకాదా?" అని శాంతమ్మగారన్న మాటలకు అందరు నవ్వుకున్నారు. రాత్రి భోజనాలయినతర్వాత కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ పడుకున్నారు.

తెల్లవారింది అందరు తలంట్లుపోసుకొని పిండివంటలతో భోజనాలు చేసారు. క్రొత్తపండగపూట అందురు ఆనందంగావున్నారు. ప్రకాశంగదిలో పడుకున్నాడు. గోపాలంగారు పేపరుచదువుకుంటున్నారు. సాయంత్రమయింది. ఎప్పుడూ పెండలాడే అల్లుడికి బట్టలు పెట్టే గోపాలంగారు ఈసారి మాత్రం సావకాశంగా కూర్చోని పేపరు చూస్తూ వుండటం శారదకు ఆశ్చర్యాన్ని కలుగజేసింది. "నాన్నా! నాన్నా!" అని పిల్చింది.

"ఏమిటమ్మా శారదా!"

"సాయంత్రమయింది. మరి ఆయనకు బట్టలియ్యి."

"ఈ సారిబట్టలుకొనదల్చుకోలేదమ్మా. మొన్ననేగా పెట్టింది, చేతిలో డబ్బులేక ఇబ్బందిగా వుంది."

"అల్లాంటప్పుడు ఎందుకు పిల్చావు?"

"పిలిస్తే తప్పేముందమ్మా! క్రొత్త ఉగాదినాడు అందరము ఉల్లాసంగా కాలం గడపవచ్చని పిల్చాను."

"బాగుంది. ఆయన ఇంటికి వెళ్లాక బట్టలు పెట్టలేదని సాధిస్తుంటె నేను సహించలేను బాబు."

"మరేంచెయ్యానమ్మా! పోస్ట్ కొట్టోకి వెళ్లి అప్పు తెస్తాలె" అని చెప్పి గోపాలంగారు బజారుకు వెళ్లబోతుండగా గదిలోనుంచి ప్రకాశంబయటకువచ్చి "మామగారూ ఆగండి. ఇప్పటివరకు మీకు మీ అమ్మాయికిజరిగినసంభాషణంతావిన్నాను. మీరు బట్టలు పెట్టకుండావుంటేనె నాకు సంతోషంగవుంది. ప్రతిపండగకు అల్లుణ్ణి పిలవటం వారికినచ్చిన బట్టలు పెట్టడం మొదలయిన పూర్వాచారాలన్ని ఈనవయుగంలో నశించాలని నా ఉద్దేశ్యము. అదీగాక మీకు ఒక్కగా నొక్క కూతురు కాబట్టి ఎల్లాగో పెడ్తారు. మిమ్మల్ని ఆదర్శముగా పెట్టుకొని నలుగురు పిల్లలుగల కుటుంబము లెంత శోభిస్తున్నాయో తెల్సా? కాబట్టి ఈ రోజునుంచి నామాట విని ఈ వెర్రిలాంఛనాలుమానెయ్యండి. ప్రతిపండగకంటె ఈ ఉగాది పండగే నాకెంతో సంతోషంగవుంది. లేనిపోని కొరతలు పెట్టుకొని మనసులు పాడుచేసుకోకండి," అని మామగార్ని ఊరడించాడు. శారదా! "ఇదేనా నీ పుత్రీప్రేమ. నామూలంగ మీ వాళ్లకు సంతోషంలేదన్నావుగాని ఇప్పుడు నీవు చేస్తున్న పనేమిటి? తండ్రి కష్టసుఖాలతో నీకు నిమిత్తంలేదా?" అని భార్యను మందలించాడు.

"నీవు చాలా మంచివాడివి ప్రకాశం. మామగార్ల కష్టసుఖాలను అవగాహన చేసుకున్న అల్లుడివంటె నీవే. నీవు చెప్పిన ఈ ఉగాది ఉపదేశాన్ని అల్లుళ్లందరు ఆచరణలో పెట్టగలరని ఆశిస్తున్నా" మన్నారు. అత్తమామలు ఈ విళంబినామ సంవత్సరమే వారికుటుంబాన్ని ఆనందసాగరంలో నోలలాడించిందని మురిసిపోతున్నారా ముసలిదంపతులు. మామగార్లమీద దాడిచేసే నవీన అల్లుళ్లందరు ప్రకాశంగారి ఉగాదిఉపదేశాన్ని ఆచరణలో పెట్టగలరని ఆశిస్తున్నా!